www.vastavam.in
# వాస్తవం.ఇన్
డిజిటల్ పత్రిక
ఎడిటర్: దండుగుల శ్రీనివాస్
News you can trust
| బుధవారం | 21-05-2025 |



## తెలంగాణ పరువును ప్రభుత్వం మంటగలిపింది

**మిస్ వరల్డ్ తారలను ఎవరు వేధించారు?**

**ప్రభుత్వం సమాధానం చెప్పాలి: మాజీ మత్రి సబిత ఇంద్రారెడ్డి**

వాస్తవం, హైదరాబాద్

మిస్ ఇంగ్లాండ్ మ్యాగీ కామెంట్స్‌పై మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డి ఆదివారం స్పందించారు. మిల్లా మ్యాగీ ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ పరువును ప్రభుత్వం మంట గలిపిందని ఆరోపించారు. మ్యాగీ ఆరోపణలపై విచారణ జరిపించాలని కోరారు. ప్రపంచ దేశాల యువతులను ఎవరు వేధించారో తేల్చాలని డిమాండ్ చేశారు. బాధ్యులు ఎవరో తేల్చాలని... మహిళా కమిషన్ స్పందించి విచారణ జరపాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



# తెలంగాణ జాగృతి పార్టీ...!

## సామాజిక తెలంగాణ ట్యాగ్‌లైన్..!!

**రెండున్నరేండ్ల కిందటే కవిత మదిలో కొత్త పార్టీ యోచన..**

**తన శ్రేయోభిలాషులతో అప్పట్నుంచే సమాలోచనలు..**

**ఎప్పటికైనా పార్టీలో తనది కరివేపాకు పాత్రేనని డిసైడ్ అయిన కవిత**



కవిత పార్టీ పెట్టడం ఖాయం. లేఖ రాజకీయాలు అందులో భాగమే. లీక్ ఉత్తదే. అంతా ప్లానింగ్ ప్రకారం జరుగుతున్న ఎపిసోడే. పార్టీలో ఎప్పటికైనా తన పరిస్థితి కరివేపాకు పాత్రేనని రెండున్నరేండ్ల కిందే డిసైడ్ అయ్యింది కవిత. కొత్త పార్టీ పెట్టాలనే తలంపు అప్పుడు వచ్చిందే. వచ్చిందే తడవు తన శ్రేయోభిలాషులతో ఆమె ఈ విషయంలో మాట్లాడి సలహాలు, సూచనలు తీసుకున్నది. ఎప్పటికైనా కవిత సీఎం కావాలంటే బీఆరెస్‌లో ఉంటే కుదరదు... కొత్త పార్టీ పెట్టుకోవాల్సిందేననే అభిప్రాయాలే మెజారిటీగా వ్యక్తమయ్యాయి. ఇక సమయం కోసం వేచి చూస్తోంది ఆమె. జరుగుతున్న వరుస రాజకీయ పరిణామాలు ఆమెను మరింత డిప్రెషన్‌లోకి నెట్టేస్తున్నాయి. తన రాజకీయ ఉనికే గల్లంతు చేసే విధంగా బీఆరెస్‌లో అన్న పెత్తనం పెరిగిపోతూ వస్తోంది. ఇది ముందే ఆమె గ్రహించినా.. తన పరిస్థితి సొంత పార్టీలో ఇంత దారుణంగా ఉటుందని భావించలేదు. ఇక ఉపేక్షించేంది లేదనే నిర్ణయానికొచ్చింది. రంగం సిద్ధం చేసుకున్నది.

(దండుగుల శ్రీనివాస్)

కేసీఆర్‌కు లేఖ రాసేంత సీన్ ఎవ్వరికీ లేదు. అందులో ఆ కుటుంబంలో. అలాంటిది కవిత సాహసం చేసిందంటే అర్థం.. తనను పార్టీ నుంచి గెంటేయాలని. కేసీఆర్ అదే చేస్తాడు. తెలుసు ఆమెకు. ఆ తరువాత కవిత చేయాల్సింది చేస్తుంది. తెలంగాణ పేరునే లేకుండా చేసిన కేసీఆర్ లాగా .. తండ్రి వేసిన తప్పటడుగులు తను వేయకుండా చాలా జాగ్రత్తగా ప్రజల వద్దకు వెళ్లేందుకు రెడీ అవుతోంది కవిత. అందుకే తన పార్టీ పేరును తెలంగాణ జాగృతి పార్టీగానే ఉండేలా చూస్తున్నది. సామాజిక తెలంగాణే లక్ష్యంగా ఈ పార్టీ ఉండబోతుందనే ప్రచారం ముమ్మరంగా ఇప్పటికే చేసి ఉన్నారు. కేసీఆర్ పాలనలో, పార్టీ నిర్వహణ, నిర్మాణంలో, తీసుకున్న నిర్ణయాల్లో జరిగిన తప్పిదాలే కవిత పార్టీకి ఆయువు పట్టుగా ఊతమిచ్చేలా ప్లాన్ చేసుకుంటున్నదామె. ఇప్పటికే ఆమె అన్ని నియోజకవర్గాలలో కొందరితో టచ్‌లో ఉన్నది. సూత్రప్రాయంగా తను పెట్టే పార్టీ గురించి వారితో మాట్లాడి తనతో రావాల్సిందిగా కూడా ఆమె కోరింది. ఎక్కువ యువత ఆమె వెంటనే పోవడానికి సిద్ధమవుతున్నారు. కేటీఆర్, కేసీఆర్ పెత్తనం, వారి పోకడలు నచ్చని హార్డ్ కోర్ బీఆరెస్ శ్రేణులు కూడా కవిత టార్గెట్ చేసింది. వారందరినీ లాక్కోనుంది.




## నాడు డీఎస్‌ను తూలనాడాడు..!

**ఇప్పుడు బిడ్డె రూపంలో తనకెదురైంది..!!**



(దండుగుల శ్రీనివాస్)

కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ పీసీసీ చీఫ్ ధర్మపురి శ్రీనివాస్ (డీఎస్)కు ఎదురైన సంఘటన ఇది. పార్టీలో తనను పట్టించుకోలేదనే కారణంతో బీఆరెస్ పార్టీ కండువా కప్పుకున్నాడు. ప్రభుత్వ సలహాదారు పదవి ఇచ్చాడు కేసీఆర్. ఆ తరువాత రాజ్యసభ మెంబర్‌ను చేశాడు. తన కూతురుకు ఇందూరులో రాజకీయంగా అడ్డమేమీ ఉండొద్దనే ఇదంతా చేశాడు. ఆ తరువాత షరా మామూలే. వేరే పార్టీలో ఉన్నప్పుడు కేసీఆర్ ఇచ్చే విలువ, గౌరవం.. తన పార్టీలో చేరిన తరువాత ఆశించొద్దు. అది అందరికీ తెలుసు. కానీ డీఎస్ తెలుసుకోలేకపోయాడు. తన సమకాలీకుడే అయినందున కేసీఆర్ తనకు మంచి ప్రయార్టీ ఇస్తాడనుకున్నాడు. కానీ పట్టించుకోలేదు. పక్కన పెట్టేశాడు. ఆ తరువాత డీఎస్ చిన్న కొడుకు అర్వింద్ రాజకీయ ఆరంగేట్రం చేశాడు. అదీ బీజేపీ నుంచి. ఇది కేసీఆర్‌కు ఊహించని షాక్. బిడ్డెకు ఎదురేలేకుండా చేద్దామని డీఎస్‌ను గంపకింద కమ్మేస్తే ఇదేందీ.. బీజేపీ ముసుగు తొడుక్కొని డీఎస్ ఇంటి నుంచే మరొకడా..? ఆ తరువాత కనీసం డీఎస్‌తో కలిసేందుకు కూడా టైమ్ ఇవ్వలేదు కేసీఆర్. ఓ సారి కలిసేందుకు వెళ్తే.. హేళనగా మాట్లాడాడు కేసీఆర్. తన మాట కొడుకు వినడం లేదని, అతని అభిప్రాయం అదేనని, చిన్నప్పట్నుంచే బీజేపీని అభిమానిస్తాడని చెప్పుకొచ్చాడు. ఎగాదిగా చూసి నువ్వేం తండ్రివయ్యా.. నువ్వు చెప్పినా వినడా..? అని.. అదే మాటను పక్కనున్న వారితో షేర్ చేసుకుని హేళనగా వెటకారంగా ఓ నవ్వు నవ్వి అక్కడి నుంచి చరాచరా వెళ్లిపోయాడు. అదే ఆఖరు మీటింగు. ఆ తరువాత డీఎస్ .. కేసీఆర్‌ను కలవలేదు. కలిసే ప్రయత్నం చేయలేదు. పార్టీలో ఉన్నా లేనట్టుగానే ఒంటరిగా గడిపాడు. రాజ్యసభ సభ్యత్వం మాత్రం కంటిన్యూ అయ్యింది. పెద్ద కొడుకు సంజయ్‌ను జైలు పాలు చేయటం, తనను ఇటు కాంగ్రెస్ కూడా పెద్దగా పట్టించకోకపోవటం... జీవిత చరమాంకంలో నరకయాతన పడ్డాడు. ఇవన్నీ ఇప్పుడెందుకంటే.. కేసీఆర్‌కూ అదే సీన్ రిపీట్ కానుంది. కవిత ఏకంగా కేసీఆర్ వైఖరినే నిలదీస్తోంది. వ్యవహారశైలిని ప్రశ్నిస్తోంది. తనదాకా వస్తేగానీ తెల్వదన్నట్టు.. జాతిపిత ఇప్పుడు బిడ్డె రూపంలో రాజకీయంగా సవాళ్లు ఎదుర్కోనున్నాడు.

# చిరంజీవి... కవిత...!

## బిడ్డెపై తండ్రికెంతో మమకారం..!!

**రాజకీయ వారసురాలిగా మాత్రం దూరం దూరం..**



(దండుగుల శ్రీనివాస్)

బిడ్డె అంటే మమకారం, ప్రేమ. చిరంజీవి కవిత.. .అని ఆప్యాయంగా వేదికల మీద పిలుచుకునే ఆప్యాయత. అందులో డౌట్ లేదు. కన్నబిడ్డంటే ఎవరికి ప్రేముండదు. అందుకు అతీతుడేమీ కాదా తండ్రి. తెలంగాణ జాగృతి పెట్టుమని సలహా ఇచ్చి రాజకీయంగా ఓనమాలు నేర్పించింది ఆయనే. ఆయనే ఆమెకు గురువు. ఇందులో ఏమీ డౌట్ లేదు. ఇప్పుడు వేరే పార్టీ పెట్టినా.. వెనుక ఆయనే ఉంటాడు. నిధులు ఆయనే సమకూరుస్తాడంటున్నారు. ఇది తప్పు. ఎందుకంటే ఆమెను బిడ్డెగానే చూశాడు తప్ప ఆ తండ్రి ఏనాడూ రాజకీయ వారసురాలిగా చూడలేదు. ఏదో తన పని తాను చేసుకుంటూ ఓ పదవిలో కొనసాగుతూ తన నీడలో సేదతీరుతుందని అనుకున్నాడు. అభిప్రాయపడ్డాడు. వదిలేశాడు. అంతకు మించి ఎక్కువ ఫోకస్ పెట్టలేదు. పట్టించుకోలేదు. కానీ తండ్రి అనుకున్నదొకటి... బిడ్డె చేస్తూ పోయిందొక్కటి. రాజకీయంలో రాటుదేలిందామె. పవర్ పాలిటిక్స్ చవి చూపిందామె. తండ్రి చాటు బిడ్డెగా జనం ఇస్తున్న మర్యాద పొందినా... గౌరవం దక్కినా తనముద్ర వేసుకునే ప్రయత్నం చేస్తూ వచ్చిందామె. జాగృతి పేరుతో అవకతవకల ఆరోపణప్పుడే ఆ తండ్రి మందలించాడు. వినలే. వదిలేశాడు. ఎంపీగా రెండోసారి ఓడిన తరువాత ఇక ఆమెను రాజకీయంగా కాదనుకున్నాడు. మరిచిపోయాడు. తనకు ఆమె ప్రియమైన బిడ్డె. అంతే. జనాల నాడి తెలుసుకోకుండా, జనంతో మమేకం కాకుండా, నేల విడిచి సాము చేసి... తనదైన లోకంలో, చెప్పుడు మాటల రాజకీయంలో బిడ్డె బందీ అయ్యిందని అర్థం చేసుకోవడానికి ఆ తండ్రికి ఎంతో సమయం పట్టలేదు. అందుకే ఆమె ఓడినప్పుడే దూరం పెట్టాడు. వదిలేశాడు. పట్టించుకోలేదు. బలవంతంగా ఆ తరువాత ఎమ్మెల్సీ. లేకపోతే ఆమెపై నమ్మకం ఉంటే.... సురేశ్‌రెడ్డికి రావాల్సిన రాజ్యసభే వచ్చి ఒళ్లో వాలేది. బిడ్డె పై ప్రేమ చావదు. మమకారం వీడదు. కానీ రాజకీయంగా ఆమెకు ఇక సపోర్టు చేయనుగాక చేయననే ఫిక్స్ అయ్యాడాయన.

కొడుకుపై అలవిమాలిన ప్రేమ. బిడ్డెకు మించి. కానీ కొడుకును పూర్తిగా నమ్మలేని స్థితి. ఇంకా రాజకీయంగా పరణతి సాధించలేదనేది కచ్చితమైన అభిప్రాయం. అందుకే వేచి చూసే దోరణే సీఎం చేయడానికి. చాన్స్ వచ్చినా కొడుకు చేతిలో పీఠం పెట్టడానికి తటపటాయించాడు. పార్టీ పగ్గాలు దాదాపుగా ఇచ్చేశాడు. అంతా కొడుకు యావే. చచ్చేలోపు సీఎం చేయాలి. అంతే. ఇక జీవితానికి ఏ పెద్ద కోరికలు లేవు. మదిలో అదే అంతర్మథనం. కొడుకు దుందుడుకు స్వభావంపై పెదవి విరుపు. తనకు మించిన అహంభావంపై ఆందోళన. బిడ్డె గురించి లేదు ఏ ఆలోచన.

ఢిల్లీ లిక్కర్ స్కాం. ఎక్కడ దెబ్బ కొట్టాలో రాజకీయంగా అక్కడే తగిలింది కేసీఆర్‌కు. ఎంతవాడుగానీ... అన్నట్టు సెంటిమెంట్‌కు లొంగని ధీరోదాత్తుడుంటాడా..? కేసీఆర్ కుంగిపోయాడు. మానసికంగా నరకం చూశాడు. కొన్ని షరతులకు లొంగాడు. అప్పటికే ఓటమి చవిచూశాడు. ఇక లొంగక, ఒప్పుకోక తప్పని స్థితి. బిడ్డె కోసం మెట్లు దిగాడు. నేలకు వచ్చాడు. అయినా ఆమె మదిలో సూపర్ హీరో ఆ డ్యాడీ. ఇంకా ఏదో చేసేదుండే. చేయలే. తననుకుంటే ఇన్ని రోజులు తను జైల్లో చిప్పకూడు తినాల్సి వచ్చెనా..? లేదు. ఇది ఆమె అభిప్రాయం. అందుకే నాన్నంటే అప్పటి వరకు ఉన్న అభిప్రాయం మారుతూ వచ్చింది. పార్శ్యాలిటీ ముసుగులో తనకన్యాయం చేస్తున్నాడనే అభిప్రాయం బలపడుతూ వచ్చింది. కొడుకు కోసమే ఆయన జీవితమని, తన గురించి ఇక ఆలోచించే స్థితి లేదని తెలిసిపోయింది. తేరుకున్నది. భవిష్యత్ ఏంటని ప్రశ్నించుకున్నది. నాన్న చూపిన దారే. అదే జాగృతి. అక్కడ్నుంచే మళ్లీ మొదలు పెట్టింది. పార్టీ లీడర్లెవరూ తోడు రారు. తెలుపు. జాగృతితోనే ముందుకు సాగాలి. తనకంటూ ఓ అస్థిత్వం ఉండాలె రాజకీయాల్లో అంటే ఏదో సాహసం చేయాలె. లేదంటే నాలుగ్గోడలకు పరిమితం చేసినా ఆశ్చర్యం లేదు. అందుకే వేరు కుంపటి కోసం డిసైడ్ అయ్యింది. అందులో భాగంగా ఆట మొదలైంది.

కేసీఆర్‌కు తెలుసు. ఇలాంటిదేదో జరుగుతుందని. కానీ దిగిరాడు. మందలించడు. బుజ్జగించడు. డోంట్‌కేర్ అంటాడు. బిడ్డె బిడ్డెనే. కానీ రాజకీయంగా ఎవరి గోల్ వారిదే. ఎంచుకున్న ప్లాట్ ఫాంలో ఎత్తుపల్లాలు, ఎదురు దెబ్బలుంటాయి. పిల్లకాకికేం తెలుసు ఉండేలు దెబ్బ. అది కేసీఆర్‌కు తెలుసు. అందుకే వదిలేశాడు. తన గోల్ తనది. మళ్లీ అధికారంలోకి పార్టీని తీసుకురావాలె. మొదట తానే సీఎం. ఆ వెంటనే కొడుకు పట్టం. ఇదే ఇప్పుడున్న ప్రధానమైన గోల్. ఈ లేఖల, కాకిగోల, కవిత గోలంతా పట్టించుకుని పక్కదారి పట్టే స్థితిలో లేదు. లైట్ తీసుకున్నాడు. చేయాల్సిన కర్తవ్యం ముందు, దిద్దుకోవాల్సిన తప్పిదాల ముందు.. ఈ ఎపిసోడ్ నత్తింగ్.